క్లుప్తంగా

అనుమతులు లేకున్నా ఎర్రమట్టి తవ్వకాలు



అద్దంకి: పిడికల తిప్ప పూర్తిగా ఎర్రమట్టితో ఉండటంతో ఇదే అదునుగా చేసుకొని కూటమి నేతలు అనుమతులు లేకున్నా ఎర్రమట్టిని తోడేస్తున్నారని అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పానెం చిన హనిమిరెడ్డి గురువారం తెలిపారు. పంగులూరు మండలంలోని కొండమంజులూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 793 లోని 36.74 పిడకల తిప్ప ఉందన్నారు. గ్రామస్తులు కలెక్టర్, మైనింగ్ అధికారులకు అర్జీలు ఇచ్చినా తవ్వకాలు ఆగడంలేదన్నారు. అధికారులు, కూటమి నేతలకు అనుకులంగా వ్యవహరిస్తుండటంతో ప్రకృతి సంపద కనుమరుగైపోతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం అక్రమంగా అమలౌతోందన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరుతో పాటు రేషన్ కార్డుల్లో సవరణలు, మార్పుల కోసం ఆనుమతించిందని ప్రజలు దరఖాస్తులను అన్ని సచివాలయాల్లో అందించాలని తహసీల్దార్ కె.గోపికృష్ణ తెలిపారు. నూతన రేషన్‌కార్డుల కోసం కుటుంబ సభ్యుల ఫొటో, ఆధార్ కార్డులు, చిన్నపిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తు ఫారంతో అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందించాలని తహసీల్దార్ ఈ మేరకు సూచించారు.


అందుబాటులో 'మన మిత్ర'



కొరిశపాడు సచివాలయం వద్ద ఉంచిన మన మిత్ర యాప్‌తో సచివాలయం సిబ్బంది

మేదరమెట్ల: ప్రభుత్వ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర యాప్‌ను అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు గురువారం తెలిపారు. ఈ యాప్‌ను స్కాన్ చేసి ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియచేసేందుకు దోహద పడుతుందని అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివుని విగ్రహానికి గ్రామోత్సవం



బల్లికురవ: కొణిదెనలోని బ్రహ్మగుండం వద్ద శనివారం ప్రతిష్ఠించిన శివుని విగ్రహానికి గురువారం మేళతాళాలు, డప్పువాయిద్యాలతో 5 గ్రామాల్లో గ్రామోత్సవం చేపట్టారు. చిలకలూరిపేట మండలంలోని తాతాపూడి మురికిపూడి, బల్లికురవ మండలంలోని వేమవరం, గంగపాలెం కొణిదెన గ్రామాల మీదుగా బ్రహ్మగుండం చేర్చి విగ్రహాన్ని జలాధి, క్షీరాధివాసాల్లో ఉంచారు. శనివారం ఉదయం 8.30 గంటలకు ప్రతిష్ఠాచార్యులు ఐనవోలు సీతారామచార్యులు బృందంచే ప్రతిష్ఠా, శాంతి కల్యాణం అన్నసంతర్పణ చేపట్టనున్నట్లు ఈ మేరకు తెలిపారు.

రాయితీ పశు దాణా సిద్ధం

అద్దంకి: ఫాడర్స్ సెక్యూరిటీ పాలసీ కింద పశు దాణాను దారిద్ర్య రేఖకు దిగువనున్న పశుపోషకులకు యాభై శాతం రాయితీపై అందజేయనున్నట్లు ఏడీ మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన పశు పోషకులు రైతు సేవా కేంద్రం వద్ద పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఒక్కో కుటుంబానికి 450 కిలోలకు మించకుండా.. రెండు గేదెలు, ఒక దూడ ఉన్నవారికి ఇస్తారని తెలిపారు. పశువు చెవికి.. కమ్మ ఉండాలని వివరించారు.

భారత మహిళా సైనికులకు అభినందనలు

చీరాల: పహల్గాంలో తీవ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా చీరాలలో గురువారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు జి.భవాని మాట్లాడుతూ మహిళల పసుపు కుంకుములు చెరిపివేసి తీవ్రవాదులను అదే సింధూర్ పేరుతో ప్రతీకార దాడిని నిర్వహించి ఉగ్రవాదులపై దాడులు నిర్వహించిన మహిళా సైనికులకు అభినందనలు తెలిపారు.

వ్యర్థాలు.. అనర్థాలు



స్థానిక కొణిదెన రోడ్డులో నివాసాల మధ్య ఎగసిపడుతున్న గ్రానైట్ వ్యర్థాల దుమ్ము, ధూళి



మార్టూరు జాతీయ రహదారి పక్కన గుట్టలుగా పేరుకుపోయిన గ్రానైట్ వ్యర్థాలు

- గ్రానైట్ డస్టుతో వ్యాపిస్తున్న శ్వాసకోశ వ్యాధులు
- ఖాళీ స్థలం కనిపిస్తే డంపింగ్
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉందా.. లేదా?

మార్టూరు: గ్రానైట్ కాలుష్యం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. మండల కేంద్రం మార్టూరుతో పాటు పలు గ్రామాలు గ్యానైట్ వ్యర్థాలు వెలువరించే దుమ్ము, ధూళితో సంవత్సరాల తరబడి సహజీవనం చేయాల్సి వస్తోంది. అటు వ్యాపారులు, ఇటు అధికారులు బాధ్యత మరచి పర్యావరణ పరిరక్షణ గాలికొదిలేశారు. మార్టూరు, నాగరాజు పల్లి, రాజుపాలెం, దేగర మూడి, జొన్నతాళి, ఇసుక దర్శి తదితర గ్రామాల పరిధిలో సుమారు 200 గ్రానైట్ ఫ్యాక్టరీలున్నాయి. గ్రానైట్ ముడి రాయి కటింగ్, పాలిష్ చేసే క్రమంలో రసాయనాలతో కూడిన వ్యర్థాలతో పాటు పాలిష్ చేసిన శ్లాబుల ద్వారా మిగిలిన ముక్కలు ఫ్యాక్టరీల్లో గుట్టలుగా పేరుకుపోతాయి. ఈ వ్యర్థాలను తరలించడం కోసం స్థానిక లంబాడి తండా సమీపంలోని కొండ దిగువన డంపింగ్ యార్డ్ కేటాయించారు. అయితే సదరు స్థలం నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్నందున చాలామంది గ్రానైట్ పరిశ్రమల యజమానులను ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ డంపింగ్ చేస్తున్నారు. స్థానిక జాతీయ రహదారి పక్కన గల శ్రీ చైతన్య స్కూలు పరిసరాల్లో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల విద్యార్థులతో పాటు నేతాజీ, రాంనగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసాల మధ్య గల ఖాళీ స్థలాల్లో గుంతలు పూడ్చి ఎత్తు పెంచడం కోసం గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే డస్టు వాడటం ప్రజల అనారోగ్య కారణాలకు కారణమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ డస్ట్ నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల మార్టూరు ప్రాంతంలో శ్వాసకోశ వ్యాధులు పెరగటానికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. స్థానిక కొణిదెన రోడ్డు సమీపంలో సినిమా హాలు ఎదురుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు తరలించిన డస్ట్ చుట్టూ ఉన్న అపార్టుమెంట్లలోకి ప్రవేశించడం వల్ల నివాసాలు శుభ్రం చేసుకోవడం సమస్యగా మారిందని వారు వాపోతున్నారు. స్థానిక కూరగాయల మార్కెట్‌ను ఆనుకొని తండాకి వెళ్లే దారితో పాటు వందలాదిమంది విద్యార్థులు చదువుకునే శ్రీహర్షిణి విద్యా సంస్థకు వెళ్లే దారిలో ఇరువైపులా గుట్టలుగా పోసిన గ్రానైట్ వ్యర్థాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పొల్యూషన్ బోర్డ్ ఏం చేస్తుందో అధికారులే చెప్పాలి.

> **చర్యలు తీసుకుంటున్నాం**
>
> గ్రానైట్ వ్యర్థాల వలన అసౌకర్యం అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల వ్యర్థాలను తరలించే వాహన యజమానిపై కేసు నమోదు చేశాం. ఈ సమస్య పట్ల ముఖ్యంగా గ్రానైట్ అసోసియేషన్ బాధ్యతాయుతంగా వ్యవహరించటమే కాక పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు అవగాహన క్యాంపులు నిర్వహించాలి.
>
> – తన్నీరు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, మార్టూరు

సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడి దారుణం

- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన విలేకరులు
- దాడులను ఖండిస్తూ నిరసన తెలిపిన నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విలేకరులు, వైఎస్సార్ సీపీ నేతలు

చినగంజాం: సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల అమానుష దాడి ఆయన పట్ల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ పర్చూరు నియోజక వర్గ పరిధిలోని పత్రికా విలేకరులు, స్థానిక రాజకీయ నాయకులు గురువారం చినగంజాంలో నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల సమీపంలో వెటర్నరీ కాలనీలో నివాసం ఉంటున్న సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి అపార్టుమెంట్‌పై నగర సెంట్రల్ ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్‌లు తమ సిబ్బందితో కలిసి ఎటువంటి నోటీసులు లేకుండా ఇంటిలోకి ప్రవేశించి గందరగోళం సృష్టించడంపై వారు మండి పడ్డారు. పొంతన లేని సమాధానాలు చెబుతూ పోలీసులు గంటకు పైగా అపార్టుమెంట్‌లో భయానక వాతావరణం సృష్టించి గౌరవ ప్రదమైన ఎడిటర్ బాధ్యతలు నిర్వహిస్తున్న ధనుంజయరెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు సమాజంలో అతని పరువు ప్రతిష్టలకు విఘాతం కలిగే రీతిలో పోలీసులు వ్యవహరించడం సరైన విధానం కాదని వారు నిరసించారు. ఇది పూర్తిగా పత్రికా రంగంపై దాడి చేయడమేనని కూటమి ప్రభుత్వంలో పత్రికా స్వేచ్ఛకు అవకాశం లేకుండా పోయిందని ఇది పూర్తిగా ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఖండించారు. అనంతరం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పత్రికా విలేకరులు సాక్షి శ్రీనివాసరావు, వార్త రమేష్ రెడ్డి, ఆంధ్రప్రభ మేషక్ బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కొత్తపాలెం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల విజయబాబు, షేక్ షాకీర్, ఆత్మకూరి సురేష్ బాబు, మేడికొండ బాబురావు పాల్గొన్నారు.

కేవీ పాలెంలో వ్యర్థాల తరలింపు

సాక్షి ఎఫెక్ట్..



అంకమ్మతల్లి ఆలయానికి వెళ్లే రోడ్డులో వ్యర్థాల తరలింపు దృశ్యం

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామ కూడలి నుంచి అంకమ్మతల్లి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలను గురువారం పొక్లెయిన్‌తో ఎత్తించి గ్రామానికి దూరంగా తరలించారు. మంగళవారం సాక్షిలో 'అపరిశుభ్రంగా అంకమ్మతల్లి ఆలయ రోడ్డు' అన్న శీర్షికతో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఎంపీడీఓ కుసుమ కుమారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సెక్రటరీ గాయత్రి ట్రాక్టర్‌తో వ్యర్థాలను గ్రామంలో దూరంగా పడవేశారు. రోడ్డుపై వేసిన ఎరువుదిబ్బలను మార్జిన్‌లోకి నెట్టించారు. వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపుల పడవేయవద్దని గ్రామ ప్రజలకు సెక్రటరీ సూచించారు. వ్యర్థాల కుప్పలతో ఆలయానికి వెళ్లే భక్తులు, పంటపొలాలకు వెళ్లే రైతులు, కూలీలు గతంలో ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఆ ఇబ్బందులు తొలగటం పట్ల గ్రామస్తులు ఎంపీడీవో, సెక్రటరీ, సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డి వామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రమాదవశాత్తు సంతమాగులూరు మండలంలోని కుందుర్రు గ్రామంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. మిరియాల చిన కోటయ్యకు చెందిన 7 ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతైంది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు.

బల్లికురవలో వర్షం

బల్లికురవ: మండల కేంద్రం బల్లికురవలో గురువారం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులతో గంటపాటు వర్షం కురిసింది. ఎండలు, వడగాల్పుల ఉధృతితో ప్రజలు విలవిల్లాడుతున్నారు. కాగా 4 రోజులుగా వాతావరణం చల్లబడుతూ ఏదో ఒక ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలుల ప్రభావంతో అరటి, బొప్పాయి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది.

ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఏసీ తిమ్మనాయుడు

అద్దంకి: ఈ నెల 15న నిర్వహించనున్న శింగరకొండ దేవస్థాన కుంభాభిషేక మహోత్సవానికి రావాలని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె. పార్థసారథికి దేవస్థాన ఏసీ గురువారం ఆహ్వానం అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావును ఆహ్వానించామన్నారు.

చేరెడ్డి మస్తాన్‌రెడ్డికి పురస్కారం

అద్దంకి రూరల్: పద్య సాహిత్యంలో విశిష్ట సేవలందించిన ప్రఖ్యాత కవి, పరిశోధకులు చేరెడ్డి మస్తాన్ రెడ్డికి 2025 సంవత్సరానికి పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ విశిష్ట సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం ఈనెల 18న పుట్టంరాజు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కుట్టుమిషన్‌ల ద్వారా ఉపాధి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత కుట్టు మిషన్ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చు అని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ అన్నారు. స్థానిక యూపీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్న కేంద్రాన్ని ఎంపీడీఓ గురువారం సందర్శించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు పేర్లు నమోదు చేసుకున్న మహిళలు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలన్నారు. శిక్షణకు హాజరు కాని వారి పేర్లు తొలగించి ఆసక్తి కలిగిన మహిళలకు శిక్షణలో అవకాశం కల్పించాలన్నారు. మొత్తం 144 మంది మహిళలు ఉచిత శిక్షణ తీసుకునేందుకు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిని రెండు బ్యాచ్‌లుగా విభజించి ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ట్రైనర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ట్రైనింగ్ సెంటర్ పరిశీలన



మేదరమెట్లలో సూచనలను అందిస్తున్న బీసీ కార్పొరేషన్ అధికారి

మేదరమెట్ల: గ్రామంలో నిర్వహిస్తున్న టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రైనింగ్ సమయంలో మెళకువలను తెలుసుకొని వృత్తిలో రాణించాలని.. కొత్త మోడల్స్‌ను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈవో లక్ష్మీకాంత్, ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ వెంటే!



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పర్చూరు ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి, ఇంకొల్లు ఎంపీటీసీ అయేషా బుడే

పర్చూరు(చినగంజాం): మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ వెన్నంటే ఉన్నారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికి పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. పర్చూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీని వీడి బయటకు వెళ్ళిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త తిరిగి పార్టీలోకి తీసుకొని వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తాము చేసిన తప్పిదాలను తెలుసుకొని తిరిగి పార్టీలోకి వచ్చేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారని వివరించారు. సాధారణ ఎన్నికల ముందు పార్టీని వీడి బయటకు వెళ్ళిన ఇంకొల్లు ఎంపీటీసీ షేక్ అయేషాబుడేను తిరిగి వైఎస్సార్‌సీపీలోకి చేర్చుకునే కార్యక్రమంలో భాగంగా ఆయన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. పర్చూరు నియోజక వర్గ పరిధిలో పార్టీని బలోపేతం చేసేందుకు చేస్తున్న కృషిని వివరించారు. పార్టీ సీనియర్ నాయకులు, మండల మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు సత్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవన సముదాయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట వాహిని, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె. కాత్యాయనిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం సత్కరించారు. ముఖ్య అతిథి.. సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు బాధ్యతతో పనిచేసి కక్షిదారులకు న్యాయం చేయాలని సూచించారు. అలానే న్యాయవాదులు కూడా న్యాయమూర్తులకు కేసుల పరిష్కార విషయంలో సహకారమందించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, బి. విజయకుమార్, ఎం. రవికుమార్, ఎస్. రామకోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి తరగతులు విద్యార్థులకు వరం



కారంచేడులో ఉచిత వేసవి తరగతుల్లో ఉపాధ్యాయులు, నిర్వాహకులు

కారంచేడు: వేసవి ఉచిత తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వక్తలు పేర్కొన్నారు. గ్రామంలో గౌతమ బుద్ధ సేవా సొసైటీ ఆధ్వర్యంలో 9,10 తరగతుల పేద విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా గురువారం స్థానిక దగ్గుబాటి రాఘవయ్యచౌదరి భవనంలో ఏర్పాటు చేసిన తరగతులకు గ్రామంలో నూతనంగా పునఃప్రారంభానికి సిద్ధమవుతున్న యార్లగడ్డ నాయుడమ్మ ఉన్నత పాఠశాలలో చేరబోయే విద్యార్థులకు ఉచిత విద్యా బోధన చేస్తున్నారు. రాబోవు రోజుల్లో విద్యను మరింత సులభతరం చేయడానికి ఈ తరగతులు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు. పావులూరి శ్రీనివాసరావు, పొదిలి మురళీకృష్ణ, యార్లగడ్డ ప్రభాకర్‌లు విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.

కాటాల్లో తేడాలు ఉండకూడదు



అవగాహన కల్పిస్తున్న తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వ్యాపారస్తుడు విధిగా వారి తూకం (కాటాలను) ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేయించుకుని వ్యాపార కార్యకలాపాలు చేసుకోవాలని తూనికలు, కొలతలుశాఖ చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు సూచించారు. తూనికల దినోత్సవాలను పురస్కరించుకుని గురువారం చీరాల మండలంలోని ఈపురుపాలెం కూరగాయల మార్కెట్, దేవాంగపురి కూరగాయల మార్కెట్‌తో పాటు, పేరాల మార్కెట్, చీరాల పట్టణంలోని నెహ్రూ కూరగాయల మార్కెట్‌లోని కూరగాయల దుకాణాలు, మార్కెట్ సమీపంలోని పండ్ల దుకాణాల్లోని కాటాల రెన్యువల్స్‌ను పరిశీలించారు. వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు అందించారు. ఈసందర్భంగా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరారవు మాట్లాడారు. ప్రతి వ్యాపారస్తుడు విధిగా తమ తూకం కొలిచే కాటాలను, రాళ్లను విధిగా రెన్యువల్ చేయించుకుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. వినియోగదారులకు తూకాల్లో మోసాలు జరగకుండా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఆదేశాలను విధిగా అంతా పాటించాలన్నారు. తూకం రాళ్లు, డిజిటల్ కాటాలను తూనికల ఇన్‌స్పెక్టర్ వద్ద రెన్యువల్ చేయించుకోవాలని, తూకంలో తేడాలు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. వినియోగదారులను మోసాలకు గురిచేస్తే వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. చీరాల డివిజన్ పరిధిలోని వ్యాపారస్తులు అంతా తమ కాటాలను రెన్యువల్ చేయించుకోవాలన్నారు.

రామాలయ శంకుస్థాపనలో దగ్గుబాటి దంపతులు



కారంచేడు రామాలయం శంకుస్థాపనలో దగ్గుబాటి దంపతులు

కారంచేడు: గ్రామంలోని పంచాయతీ బజారు ప్రాంతంలో కొలువైన శ్రీకోదండరామ స్వామివారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 6.54 నిమిషాలకు గ్రామానికి చెందిన మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలతో శంకుస్థాపన నిర్వహించారు. గ్రామానికి చెందిన అనేక మంది దాతలు, అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేకంగా దంపతులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకస్వాములతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్విక్కుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమం ఘనంగా జరిపించారు.

కార్డులు సిద్ధం

అద్దంకి: పురపాలక సంఘ పరిధిలో చెత్త, ప్లాస్టిక్‌ను సేకరించే వారికి గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ రవీంద్ర గురువారం తెలిపారు. దాని కోసం ఈ నెల 14న ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్‌డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ పథకం ద్వారా పొడి వ్యవర్థాలను ఏరుకునే వారు, పారిశుద్ధ్య కార్మికులు, వృత్తిపరమైన గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి సమాజిక భద్రత, మెరుగుపరచేందుకు శిక్షణ ఇవ్వడం ఈ పథక ఉద్దేశమని తెలిపారు.